సాక్షి
కామారెడ్డి
శనివారం | 16 | ఆగస్టు | 2025



ప్రతిపాదనలు తయారు చేయండి

బిచ్కుంద మున్సిపాలిటీ అభివృద్ధికి నిధుల కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సూచించారు.

- 8లో ▸



ఉత్తమ సేవలకు ప్రశంసలు

జిల్లాలో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రశంస పత్రాలను అందించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.0 /21.9

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'పోచారం' అందాలు.. ఎమ్మెల్యే కెమెరాలో..



నాగిరెడ్డిపేట : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శుక్రవారం నాగిరెడ్డిపేట మండలంలో పర్యటించారు. మండలకేంద్రంలోని శ్రీ కోదండ రామాలయం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన టీ స్టాల్‌ను ప్రారంభించి, టీ తాగారు. అనంతరం పోచారం ప్రాజెక్టును సందర్శించారు. నిండుకుండలా ఉన్న ప్రాజెక్టు అందాలను ఎమ్మెల్యే తన సెల్‌ఫోన్ కెమెరాలో బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, మాల్తుమ్మెద సొసైటీ మాజీచైర్మన్ రాంచందర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీరాంగౌడ్, నాయకులు పర్వతరావు, ఇమామ్, నర్సింహారెడ్డి, సురేందర్‌గౌడ్, సాయాగౌడ్, షాహెద్, లక్ష్మణ్ ఉన్నారు.

ఉత్తమ గ్రామ సమాఖ్యగా 'కుర్ల' ఎంపిక



కామారెడ్డి క్రైం: రబీ సీజన్‌లో అత్యధికంగా వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టిన మద్నూర్ మండలం కుర్ల గ్రామ సంఘం ఉత్తమ గ్రామ సమాఖ్య అవార్డుకు ఎంపికైంది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవాల్లో ముఖ్య అతిథి కోదండరెడ్డి చేతుల మీదుగా సంఘం ప్రతినిధులు అవార్డును అందుకున్నారు. గత సీజన్‌లో 76 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినందుకు ఉత్తమ గ్రామ సంఘంగా కుర్ల ఎంపికైందని డీఆర్‌డీవో సురేందర్ తెలిపారు.

లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కుంకుమార్చనలు



మాచారెడ్డి : శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా చుక్కాపూర్‌లోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలతో పాటు కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో కామారెడ్డి, నిజామాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఈవో శ్రీధర్‌రావు, డైరెక్టర్ లక్ష్మీరాజం, అర్చకులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి!

ఎల్లారెడ్డి : సింగితం అటవీ ప్రాంతంలోని పేకాట స్థావరంపై ప్రత్యేక పోలీస్ బృందం శుక్రవారం దాడి చేసినట్లు తెలిసింది. పేకాడుతున్న 14 మంది నుంచి కొంత నగదు, సెల్‌ఫోన్లు, బైకులు స్వాధీనం చేసుకున్నారని సమాచారం.

రైతు సంక్షేమానికి పెద్దపీట

- రాష్ట్రంలో అన్నదాతల కోసం రూ. 1.13 లక్షల కోట్లు ఖర్చు చేశాం
- మహిళలకోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాం
- వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి
- జిల్లాలో ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవాలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న కోదండరెడ్డి





జాతీయ పతాకానికి వందనం సమర్పిస్తున్న ముఖ్య అతిథి కోదండరెడ్డి, కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర, అధికారులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/కామారెడ్డి క్రైం: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశామని వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి పేర్కొన్నారు. అన్నదాతల సంక్షేమానికి ఇప్పటివరకు రూ. 1.13 లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసులనుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

- జిల్లాలో 15,302 కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేశాం. పాత రేషన్ కార్డులలో 48,971 మంది పేర్లు నమోదు చేశాం. 2,56,732 కార్డులకు సన్నబియ్యం అందిస్తున్నాం.
- చేయూత పథకం ద్వారా జిల్లాలో 1.62లక్షల మందికి ప్రతినెలా రూ. 36.22 కోట్లు పంపిణీ చేస్తున్నాం.
- జిల్లాలో 11,818 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 5,790 నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు లబ్ధిదారులకు రూ. 25.56 కోట్లు చెల్లించాం.
- జిల్లాలో బడిబాట ద్వారా 18,977 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఐదు పాఠశాలల్లో వంద శాతం అడ్మిషన్లు జరిగాయి. విద్యార్థులు లేక మూసివేసిన ఐదు పాఠశాలలను తిరిగి తెరిచాం.
- ఏడాది కాలంలో జిల్లాలో 17,027 మంది నిరుపేదలకు శస్త్ర చికిత్సలు ఉచిత చికిత్సల కోసం రూ. 44 కోట్లు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఖర్చు చేశాం.
- ఈ ఏడాది 768 చెరువులలో 2.83 కోట్ల చేప పిల్లలను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.



ఎస్సీ సంక్షేమ హాస్టల్ విద్యార్థినుల ప్రదర్శన..

- భూభారతి ద్వారా భూ సమస్యలను పరిష్కరించడం కోసం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 36,752 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు అంగీకారయోగ్యమైన 977 కేసులను పరిష్కరించాం.
- బిచ్కుంద పట్టణాన్ని మున్సిపాలిటీగా చేశాం.
- అమృత్ -2 పథకం ద్వారా జిల్లా మూడు మున్సిపాలిటీలలో రూ.180 కోట్లతో చేపట్టిన నీటి సరఫరా పనులు పురోగతిలో ఉన్నాయి.

వ్యవ'సాయం'..

ప్రస్తుత వానాకాలం సీజన్ కోసం జిల్లాలో 71,306 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు, 2,423 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు, 1,495 క్వింటాళ్ల వరి విత్తనాలను పంపిణీ చేశాం. 3,03,568 మంది రైతులకు రూ. 305.98 కోట్ల ఇందిరమ్మ రైతు భరోసా సహాయాన్ని అందించాం. 1,96,554 మంది రైతులకు బీమా చేయించాం.

యాసంగిలో 3,82,555 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 73,640 మంది రైతుల ఖాతాల్లో రూ. 887.53 కోట్లు జమ చేశాం.



'మహాలక్ష్మి'లకు..

- మహిళలు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఉపయోగించుకోవడం ద్వారా ఇప్పటివరకు రూ. 167.19 కోట్లు ఆదా చేసుకోగలిగారు.
- రూ. 5 వందలకు గ్యాస్ సిలిండర్ సరఫరా పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు 1,50,131 కుటుంబాలకు 5,58,981 గ్యాస్ సిలిండర్లు సరఫరా చేశాం. ఇందుకోసం రూ. 16.05 కోట్లు వెచ్చించాం.
- గృహజ్యోతి పథకం ద్వారా 1,62,747 కుటుంబాలకు 2 వందల యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తున్నాం. ఇందుకోసం ఇప్పటివరకు రూ. 82.74 కోట్లు వెచ్చించాం.

- జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ తీసుకున్న భద్రతా చర్యలు, కట్టుదిట్టమైన నిబంధనల అమలుతో రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గింది. జిల్లా పోలీసు శాఖ సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా రూ. 4 కోట్ల విలువైన 2,427 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాల్వంచ ఉన్నత పాఠశాల విద్యార్థులు, జంగంపల్లి మహాత్మా జ్యోతీబా పూలే విద్యార్థినులు, బీసీ, ఎస్సీ హాస్టళ్ల విద్యార్థులు, ఎస్పీఆర్ స్కూల్ విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలను ఆహూతులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర, డీఎఫ్‌వో నిఖిత, ఏఎస్పీ చైతన్యరెడ్డి, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, ఆర్డీవో వీణ, జిల్లా అధికారులు దయానంద్, సతీష్, ప్రమీల, విజయ్‌పాల్‌రెడ్డి, సురేందర్, శివ కుమార్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత కోసం..

- ఇందిర మహిళా శక్తి పథకం కింద గ్రామీణ ప్రాంతాలలో రూ. 169.29 కోట్లతో 12,905 యూనిట్లను, పట్టణ ప్రాంతాలలో రూ. 5.89 కోట్ల పెట్టుబడితో 154 యూనిట్లను ఏర్పాటు చేయించాం.
- విద్యార్థుల యూనిఫాంలు కుట్టడం ద్వారా మహిళా సంఘాలకు రూ. 1.16 కోట్ల ఆదాయం వచ్చింది.
- బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా గ్రామీణ మహిళా సంఘాలకు గత ఆర్థిక సంవత్సరంలో రూ. 818.47 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 203 కోట్లు, పట్టణ మహిళ సంఘాలకు రూ. 30 కోట్ల రుణాలు అందించాం.




సాంస్కృతిక ప్రదర్శనలను తిలకిస్తున్న కోదండరెడ్డి, కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్‌చంద్ర, అధికారులు



జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ శకట ప్రదర్శనలో ఉద్యోగులు



పాల్వంచ హైస్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన



జిల్లా సమాఖ్యకు రూ. 50 కోట్ల రుణాన్ని అందిస్తున్న కోదండరెడ్డి, అధికారులు

లోలెవల్ కష్టాలు తీరేదెప్పుడు?

- వాగులు పారితే రాకపోకలకు అంతరాయం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

గాంధారి: చాలా గ్రామాలకు లోలెవల్ వంతెనల కష్టాలు తీరడం లేదు. వర్షాలు కురిసి వాగులు పారితే రాకపోకలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గాంధారి నుంచి గుర్జాల్ మీదుగా వండ్రికల్ వెళ్లే మార్గంలో గుర్జాల్–వండ్రికల్ గ్రామాల మధ్యలో లోలెవల్ వంతెన ఉంది. చిన్నపాటి వర్షానికే ఈ వాగు వంతెనపైనుంచి వరద నీరు పారుతోంది. గుర్జాల్ గ్రామానికి చెందిన చాలామంది రైతుల పొలాలు వాగు అవతల ఉన్నాయి. దీంతో వాగు ఉధృతి తగ్గేంతవరకు గుర్జాల్ రైతులు అవతలే ఉండాల్సి వస్తోంది. వండ్రికల్, వండ్రికల్ క్యాంపు, వండ్రికల్ తండా వాసులతో పాటు లింగంపేట్ మండలం మోతె గ్రామానికి చెందిన ప్రజలు వివిధ పనులపై గాంధారికి వస్తుంటారు. గుర్జాల్‌వాగు ప్రవహిస్తున్నప్పుడు వారూ ఇబ్బందులు పడుతున్నారు.

గాంధారి –తిప్రారం రహదారిలో ఈదుల్లా వాగు పారితే ఈ మార్గంలో ఉన్న లోలెవల్ వంతెన మునిగిపోతుంది. దీంతో తిప్పారం, తిప్పారం తండా, సోమారం తండా, బొప్పాజువాడి, బూర్గుల్‌తో పాటు సదాశివనగర్ మండలం ఉత్తునూర్, వజ్జపల్లి, యాచారం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.



గాంధారి -తిప్పారం ఈదుల్లా వాగు వంతెన పైనుంచి పారుతున్న నీరు (ఫైల్)



గుర్జాల్ -వండ్రికల్ వాగు వంతెనపై నుంచి పారుతున్న వరద నీరు (ఫైల్)

గాంధారి –దుర్గం మార్గంలో గుజ్జుల్ తండా వద్ద వాగుపై ఉన్న లోలెవల్ వంతెనతోనూ ఇలాంటి ఇబ్బందులే ఉన్నాయి. వాగొస్తే లొంక తండా, దుర్గం, కొత్తాబాది తండా, జెమిని తండా, బీర్మల్ తండాలకు గంటల తరబడి రాకపోకలు నిలిచిపోతుంటాయి. గతంలో ఈ వంతెనపై నుంచి వరద నీరు పారుతున్న సమయంలో వాగు దాటేందుకు యత్నించిన లొంకతండాకు చెందిన యువకుడు గల్లంతై చనిపోయాడు. ఇక్కడ వంతెన నిర్మిస్తామని పాలకులు హామీ ఇచ్చినా ఏళ్లు గడుస్తున్నా అది ఆచరణలోకి రావడం లేదు.

ఇబ్బందిపడుతున్నం



గ్రామానికి చెందిన చాలా మంది రైతుల భూములు వాగవతల ఉన్నాయి. వానలు పడితే వాగు వంతెనపై నుంచి పారుతుంది. రాకపోకలు నిలిచిపోయి ఇబ్బంది అవుతోంది. – వంజరి శ్రీనివాస్, గుర్జాల్‌వాసి

వంతెన నిర్మించాలి



గుజ్జుల్ వాగుపై లోలెవల్ వంతెన ఉంది. వానలు పడితే చాలా ఇబ్బంది అవుతోంది. గంటల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. అధికారులు స్పందించి కొత్త వంతెన నిర్మించాలి. – శివాజీ, దుర్గంవాసి

నిజాంసాగర్‌లోకి భారీ వరద

25,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువన ఉన్న మెదక్, సంగారెడ్డి జిల్లాలలో కురుస్తున్న వర్షాలకు శుక్రవారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సింగూరు ప్రాజెక్టుతో పాటు ఘనపురం ఆనకట్ట, హల్దీ వాగుల ద్వారా 25,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. నిప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగుల(17.8 టీఎంసీలు)కుగాను శుక్రవారం సాయంత్రానికి 1,394.92 అడుగుల (6.781 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.



సింగీతం గేట్ల ద్వారా విడుదలవుతున్న జలాలు

సింగూర్ మూడు గేట్ల ఎత్తివేత

ఎగువన సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. దీంతో ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తి 27 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ఈ నీరు నిజాంసాగర్ ప్రాజెక్టును చేరనుంది.



నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం

'సింగితం' గేట్ల ఎత్తివేత

నిజాంసాగర్ : అల్పపీడన ద్రోణి ప్రభావంలో ఎగువన వర్షాలు కురుస్తుండడం శుక్రవారం సింగితం రిజర్వాయర్‌లోకి 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో నీటిపారుదల శాఖ అధికారులు మూడు వరద గేట్లను ఎత్తి 600 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువకు మళ్లించారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 416.550 మీటర్లనుగాను ప్రస్తుతం 415.900 మీటర్ల నీరుంది. ఎగువ నుంచి వరద నీరు వస్తుండడంతో ఫ్లడ్ గేట్ల ద్వారా నీటిని ప్రధాన కాలువకు మళ్లిస్తున్నామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఏఈలు శివప్రసాద్, సాకేత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కాశీనాథ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సింగితం రిజర్వాయర్ గేట్లను ఎత్తుతున్న నీటిపారుదలశాఖ అధికారులు

క్లుప్తంగా

అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేయండి



బిచ్కుంద(జుక్కల్) : కొత్తగా ఏర్పాటు చేసిన బిచ్కుంద మున్సిపాలిటీ అభివృద్ధి నిధుల కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 12 వార్డులలో చెత్త సేకరణ కోసం చిన్న విధులలో వెళ్లడానికి ట్రాలీ ఆటోలు కావాలని, కార్యాలయంలో కంప్యూటర్లు ఇతర సామగ్రి కోసం సుమారు రూ. 50 లక్షల నిధులు కావాలని కమిషనర్ ఖయ్యూం ఎమ్మెల్యేకు నివేదిక అందించారు. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు, మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీచైర్‌పర్సన్ కవిత, నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్, విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, దడ్గి నాగ్‌నాథ్, గంగాధర్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

నిజాంసాగర్ (జుక్కల్): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా కార్యకర్తలు నాయకులు కలిసికట్టుగా ముందుకెళ్లాలని ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు అన్నారు. శుక్రవారం జుక్కల్ క్యాంపు కార్యాలయంలో మహమ్మద్ నగర్ మండలానికి చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలు చేరారు. పార్టీ కోసం, అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పని చేసిన వారికి మంచి పదవులు లభిస్తాయన్నారు. పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్ పటేల్, మహమ్మద్ నగర్ నిజాంసాగర్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ఏలే మల్లికార్జున్, నాయకులు రమేష్ యాదవ్ కాలిక్, తోటరాజు, సిద్దు, మల్లయ్య, ఆకాష్ తదితరులున్నారు.

పేకాట స్థావరంపై దాడి

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పెద్ద పోతంగల్ గ్రామశివారులో పేకాట స్థావరంపై శుక్రవారం దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గ్రామ శివారులో పేకాడుతున్నారనే పక్కా సమాచారం మేరకు దాడి చేసి రూ.5885 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆరుగురిని అరెస్టు చేయగా, ఒకరు పారిపోయారని తెలిపారు. మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉత్సవాలకు విరాళం

దోమకొండ: మండలంలోని చింతమాన్‌పల్లి గ్రామంలో జరుగుతున్న మల్లికార్జున స్వామి నూతన దేవాలయ నిర్మాణానికి శుక్రవారం ముత్యంపేట గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ముత్తగారి శిరిష్‌గౌడ్ రూ.11వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ ప్రతినిదులు ఉన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు



రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కలెక్టర్ సంగ్వాన్ నుంచి ప్రశంసపత్రం అందుకుంటున్న డీఎఫ్‌వో నిఖిత

జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వివిధ శాఖలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను శకటాల ద్వారా ప్రదర్శించారు. విద్యార్థుల సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విధుల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ముఖ్య అతిథి కోదండ రెడ్డి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందజేశారు. పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రజలు, విద్యార్థులు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొన్నారు.
- కామారెడ్డి క్రైం



విక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ | సురేందర్, డీఆర్డీవో | విజయ్‌పాల్ రెడ్డి, పీడీ, హౌసింగ్ | ప్రమీల, జిల్లా సంక్షేమ అధికారిణి | శివకుమార్, ఇన్‌చార్జి సీపీవో



సతీష్ యాదవ్, ఏడీ, భూగర్భజల శాఖ | వీణ, ఆర్డీవో, కామారెడ్డి | కరుణ శ్రీ, డీఎం, ఆర్టీసీ, కామారెడ్డి | సయిాద్ అహ్మద్ మస్రూర్, ఏవో, కలెక్టరేట్ | స్వప్న, సూపరింటెండెంట్, కలెక్టరేట్



రజిత, సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్ | మనోజ్, హెచ్‌హెచ్‌పీ, కలెక్టరేట్ | హరీష్, కలెక్టర్ సీసీ | ప్రసాద్ రెడ్డి, అదనపు కలెక్టర్ సీసీ | శ్రీపాల్ రెడ్డి, రికార్డ్ అసిస్టెంట్, కలెక్టరేట్ | ప్రేమ్ కుమార్, తహసీల్దార్, ఎల్లారెడ్డి | సంతోష్ కుమార్, టెక్నికల్ ఏవో, డీపీవో | సురేష్, డీపీఎం, డీఆర్‌డీపీ | చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో | చలపతి, హెచ్‌ఈవో, డీఎంహెచ్‌వో కార్యాలయం




స్వాతి, నర్సింగ్ ఆఫీసర్, ఎర్రాపహాడ్ పీహెచ్‌సీ | నవనీత, నర్సింగ్ ఆఫీసర్, దేవునిపల్లి, పీహెచ్‌సీ | ఆశయ్య, ఆఫీస్ సబార్డినేట్, డీఎంహెచ్‌వో | విజయలక్ష్మి, డీసీహెచ్ఎస్, కామారెడ్డి | సతీష్ కుమార్ శర్మ, సూపరింటెండెంట్, జెడ్పీ | ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్, డీపీవో | వినయ్, జూనియర్ అసిస్టెంట్, డీపీవో | ఆర్.జగన్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్, బాన్సువాడ | అబ్దుల్ రజాక్, జూనియర్ అసిస్టెంట్, జీజేసీ, బాన్సువాడ | ఉస్మాన్, ఎస్సై, సీసీఎస్



గణపతి, కానిస్టేబుల్, సీసీఎస్ | రవి, కానిస్టేబుల్, సీసీఎస్ | వహీద్, సీనియర్ అసిస్టెంట్, డీపీవో | సంతోష్, కానిస్టేబుల్, డీసీఆర్‌బీ | రాజేశ్వరి, ఉమెన్ పీసీ, కలెక్టరేట్



డి.బుజ్జి, ఉమెన్ పీసీ, నస్రుల్లాబాద్ పీఎస్ | విశ్వనాథ్, కానిస్టేబుల్, కామారెడ్డి పీఎస్ | విఠల్, కానిస్టేబుల్, మద్నూర్ పీఎస్ | శశికాంత్, పీసీ, సదాశివనగర్ పీఎస్



ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థికి ప్రోత్సాహక బహుమతిని అందజేస్తున్న వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కలెక్టర్ సంగ్వాన్

పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన ఎర్రకుంటతండావాసులు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఏర్రకుంటతండావాసులు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. మండలంలోని బెజుగంచెరువుతండా గ్రామపంచాయతీ పరిధిలో బెజుగంచెరువుతండాతోపాటు ఎర్రకుంటతండా ఉన్నాయి. బెజుగంచెరువుతండా గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. దీంతో బెజుగంచెరువుతండాలో జీపీ భవననిర్మాణం కోసం మార్కింగ్ ఇచ్చేందుకు గురువారం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏర్రకుంటతండావాసుల అభ్యంతరంతో అధికారుల మార్కింగ్ పనులను నిలిపివేశారు. ఈ క్రమంలో తమ తండాలో గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను ఏర్రకుంటతండాకు చెందిన కొందరు అడ్డుకుంటున్నారని పేర్కొంటూ బెజుగంచెరువుతండావాసులు గురువారం నాగిరెడ్డిపేట ఎంపీడీవోపాటు ఎస్సైకి పిర్యాదు చేశారు. శుక్రవారం ఎర్రకుంటతండావాసులు రెండుట్రాక్టర్లతోపాటు బైక్‌లపై భారీగా పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. బెజుగంచెరువుతండా గ్రామపంచాయతీ భవనిర్మాణ విషయమై ఇరుతండావాసులు కూర్చుని మాట్లాడుకొని సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఎస్సై భార్గవ్‌గౌడ్ సూచించారు.

సంక్షేమఫలాలు అందినప్పుడు నిజమైన స్వాతంత్ర్యం



బాన్సువాడ : ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి తన నివాసం వద్ద, క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అశోక్ చక్రంను ఆగ్రో చైర్మన్ కాసుల బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయిలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యే, గ్రామానికి సర్పంచే దేవుడని అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, డీఎస్పీ విఠల్‌రెడ్డి, డీఎఫ్‌వో సునీత, ఎఫ్‌ఆర్‌వో అబిబ్, తహసీల్దార్ వరప్రసాద్, కమిషనర్ శ్రీహరి రాజు, డిఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

అన్న వెంటే తమ్ముడు

● సోదరుని మరణాన్ని తట్టుకోలేక గుండెపోటుతో మృతి

వేల్పూర్: అన్న మరణాన్ని తట్టుకోలేక తమ్ముడు గుండెపోటుకు గురై మరణించిన ఘటన శుక్రవారం వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దివంగత రిటైర్డ్ టీచర్ అయ్యవార్ల మురళీధర్‌రావుకు భార్గవ్‌శ్యాం, ప్రేమ్‌కుమార్, విజయ్‌కుమార్ అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్దకొడుకు భార్గవ్‌శ్యాం ప్రైవేటు కంపెనీలో పనిచేసుకుంటూ చాలా ఏళ్లుగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో నివాసముంటున్నాడు. ప్రేమ్‌కుమార్ కలకత్తాలో ఉంటుండగా, విజయ్‌కుమార్ అంక్సాపూర్‌లో ఇంటి వద్దనే ఉండేవాడు. భార్గవ్ శ్యాం(57) కొద్దికాలంగా పక్షవాతంతో బాధపడుతూ గురువారం రాత్రి మరణించాడు. ఆయన మరణవార్తను శుక్రవారం ఉదయం అంక్సాపూర్‌లో ఉన్న తమ్ముడు విజయ్‌కుమార్‌కు తెలిపారు. దీంతో విజయ్‌కుమార్ తీవ్ర మనస్తాపం చెంది గుండెపోటుకు గురయ్యాడు. గ్రామస్తులు వెంటనే స్థానిక ఆర్ఎంపీ వద్ద ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. భార్గవ్‌శ్యాం అంత్యక్రియలు శుక్రవారం పూర్తికాగా, విజయ్‌కుమార్ అంత్యక్రియలు కలకత్తాలో ఉండే అన్న ప్రేమ్‌కుమార్ శనివారం ఇంటికి వచ్చిన తర్వాత నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అన్నదమ్ములు ఒకరివెంట ఒకరు మరణించడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు



రాజంపేట: వీధి కుక్కల దాడిలో నాలుగేళ్ల బాలుడికి తీవ్రగాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గుర్రాల రమేశ్ కొడుకు ధనుంజయ్(4) స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. గురువారం మధ్యాహ్నం 3గంటలకు మూత్ర విసర్జన కోసం పాఠశాల ఆవరణలోకి వెళ్లగా వీధి కుక్కలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. దీంతో ధనుంజయ్‌కి తీవ్రగాయాలయ్యాయి. కుక్కలను తరిమే ప్రయత్నంలో ఓ ఉపాధ్యాయురాలిపై దాడికి యత్నించినట్లు తెలిసింది. విద్యార్థి ప్రస్తుతం కామారెడ్డి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్ర సమీపంలోని 161 జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మాడు సాయవ్వ శుక్రవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం 161 జాతీయ రహదారి దాటుతుండగా పిట్లం నుంచి బిచ్కుంద వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. సాయవ్వకు గాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం సాయవ్వను మెరుగైన వైద్యం కోసం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శులదే ప్రధానపాత్ర



పంచాయతీ కార్యదర్శులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులదే ప్రధాన పాత్ర అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉత్తమపని తీరు కనబర్చిన పంచాయతీ కార్యదర్శులను ఆయన సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించగా, అవి నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్న పంచాయతి కార్యదర్శులను ఆయన అభినందించారు. కార్యదర్శులను శాలువాతో సన్మానించి ప్రశంసాపత్రాలను అందించారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫాంల అందజేత

ఎల్లారెడ్డి మున్సిపాలిటి పారిశుధ్య సిబ్బందికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు యూనిఫాంలను అందజేశారు.వారిని శాలువాతో సన్మానించి, ప్రశంసాపత్రాలను అందజేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టన అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత, మున్సిపల్ మాజీ చైర్మన్లు కుడుములసత్యనారాయణ, పద్మశ్రీకాంత్, సొసైటీ వైస్ చైర్మెన్ ప్రశాంత్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గఫార్, ఆరీఫ్, మున్సిపల్ కమీషనర్ మహేష్‌కుమార్ తదితరులున్నారు.

రామారెడ్డి మైదానాన్ని మినీ స్టేడియంగా మారుస్తా..

రామారెడ్డి: రామారెడ్డి మైదానాన్ని మినీ స్టేడియంగా మారుస్తానని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రామారెడ్డి గ్రామంలో ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శుక్రవారం ప్రారంభించారు. గంగమ్మ వాగు బ్రిడ్జి పనిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి చేస్తామన్నారు. కాలభైరవుడు ఆలయ అభివృద్ధికి కోసం కావలసిన నిధులు మంజూరు చేయించినట్లుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ఇర్షత్, సింగిల్ విండో చైర్మన్ సదాశివరెడ్డి, వైస్ చైర్మన్ పశుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవుఫ్, మండలఅధ్యక్షుడు లక్ష్మాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్ సిందూర్‌పై ప్రదర్శన ఇస్తున్న బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులు



జంగంపల్లి బీసీ గురుకుల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



జిల్లాకేంద్రంలోని ఎస్‌పీఆర్ విద్యార్థులు..

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించిన వేడుకలలో పలు విద్యాసంస్థలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చాయి. విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆహూతులను అలరించారు.



బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులతో అధికారులు

రైతులకు మరింత సేవ చేసుకునే అవకాశం

- ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి
- సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం



ఎన్‌డీసీసీబీలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రమేశ్ రెడ్డి

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని సహకార సంఘాలు, డీసీసీబీల పాలకవర్గాల పదవీకాలం గడువు మరోసారి ఆరు నెలలు పొడిగించి రైతులకు మరింత సేవ చేసుకునే భాగ్యాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రివర్గం కల్పించిందని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌డీసీసీబీ ప్రధాన కార్యాలయ ఆవరణలో శుక్రవారం పాలకవర్గాల గడువు ఆరు నెలలు పొడిగించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రమేశ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్‌డీసీసీబీని రాష్ట్రంలోనే ఉత్తమమైన బ్యాంకుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రధానంగా ఎన్‌పీఏ తగ్గింపుపై ప్రత్యేక దృష్టి సారించామని, అందరి సహకారంతో బ్యాంకుకు పూర్వవైభవం తీసుకొస్తామని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహకార సంఘాల చైర్మన్లు, బ్యాంకు డైరెక్టర్ల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్ రెడ్డి, డైరెక్టర్లు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.